ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఆగస్టు 2024



సర్దుబాటుకు తేలిన లెక్క

- జిల్లాలో 870 మంది మిగులు టీచర్లు
- ప్రారంభమైన కౌన్సెలింగ్
- ఫలించిన ఉపాధ్యాయ సంఘాల పోరాటం

నెల్లూరు (విద్య), ఆగస్టు 17: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విడుదల చేసిన జాబితాలో ఖాళీల ప్రకటన అంతా అస్తవ్యస్తంగా ఉందని, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పద్ధతిలోనే ఈ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామంటూ ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలు పరిగణలోకి తీసుకోకుండా సర్దుబాటు చేపడితే తాము అంగీకరించమని ఆ సంఘాలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 12న నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. అనంతరం ఈనెల 15 నుంచి టీచర్ల నుంచి వినతులు స్వీకరించారు. 16న కొత్త సీనియారిటీ జాబితాలు విడుదలతోపాటు అభ్యంతరాలు స్వీకరించి, 17న కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రకటించారు. దీంతో ఈ ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టారు.

సర్దుబాటుకు ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి, కొరత ఉన్నచోట సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. అలాగే కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా, కొన్ని చోట్ల తక్కువగా ఉన్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో బోధన పూర్తిగా కుంటుపడుతోంది. కొన్ని సబ్జెక్టులను అసలు బోధించే వారే లేకుండా పోయారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టి చర్యలు ప్రారంభించింది. కొందరు సర్‌ప్లస్‌లో ఉన్నా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. అధికారులపై వివిధ రకాల ఒత్తిళ్లు చేసి అక్కడే ఉంటామంటున్నారు. గత ప్రభుత్వంలో సర్దుబాటు ప్రక్రియ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లోనే జరిగింది.

సక్రమంగా చేపట్టాలని...

తాజాగా ప్రభుత్వం మారిన తరుణంలో సర్దుబాటు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. జిల్లాలో చేపట్టాల్సిన సర్దుబాటులో లోపాలున్నాయంటూ ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకమై ఆందోళన చేశాయి. అన్ని మండలాల్లో ఉన్న మిగులు టీచర్లు, అవసరమైన టీచర్లు, వారి సీనియారిటీ జాబితాలను ఆన్‌లైన్‌లో ఉంచినా, చాలా మండలాల్లో ఉపాధ్యాయుల వివరాలు, పోస్టులు, ఖాళీలు చూపడంలో పొరపాట్లు ఉన్నాయని చెబుతున్నారు. తామంతా జీవో నెం 117ను వ్యతిరేకిస్తున్నా దాని ప్రకారం సర్దుబాటుకు సంబంధించి మిగులు టీచర్లు కొరత ఉన్న పాఠశాలలను గుర్తించడం సరికాదంటున్నారు. కొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు స్కూల్‌అసిస్టెంట్‌లను ఎస్‌జీటీలుగా నమోదు చేయడం, సీనియారిటీలను సక్రమంగా తెలియచేయకపోవడం తదితరు సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. తప్పులు సరిదిద్దకుండానే జాబితాలను అప్‌లోడ్ చేయడంతో అత్యధిక పాఠశాలల్లో సీనియర్‌లు జూనియర్‌లు, జూనియర్స్ సీనియర్లుగా మారిపోయారంటున్నారు. అలాగే జీవో నెం 117 ప్రకారం కాకుండా పాత జీవో నెం 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా ఉండగా పాత వైసీపీ ప్రభుత్వ జీవో ప్రకారం చేపడితే మరిన్ని పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దీన్ని సవరించాలని కోరుతున్నారు.

జిల్లాలో 870 మిగులు టీచర్లు

జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి 870 మంది మిగులు టీచర్లు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. మిగులు టీచర్ల సంఖ్యలో నెల్లూరు రూరల్ 82 మందితో అగ్రస్థానంలో ఉండగా, వింజమూరు 8మందితో చివరిస్థానంలో నిలిచింది. ఈనెల 16వతేదీ వరకు పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని సర్దుబాటు చేస్తారని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో పాఠశాలల్లో నమోదు కాని విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఒకరిద్దరు విద్యార్థులు తక్కువైన పాఠశాలలో పోస్టులు మిగులుగా తేలితే వాటిని పోకుండా కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు యూడైస్‌లో పేరు ఉన్న విద్యార్థులంతా కూడా ప్రతిరోజూ పాఠశాలలకు రావాల్సిందేనని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో టీచర్ల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో, పోస్టులను ఎలా కాపాడుకుంటారో వేచి చూడాల్సిందే.





మహోన్నత భావాలు కలిగిన వ్యక్తి

ముప్పవరపు వెంకయ్య నాయుడు దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, అలాంటి మహోన్నత భావాలు కలిగిన వారు చాలా అరుదుగా కనిపిస్తారని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ అన్నారు. ఆయన ఆలోచనలు మహోన్నతమైనవంటూ కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల వికాసం కోసం ఆయన నిరంతరం శ్రమిస్తూనే ఉంటారన్నారు. ఆయన మానసపుత్రిక స్వర్ణ భారత్ ట్రస్ట్ ఒక ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండా 23 ఏళ్ల పాటు ఈ ట్రస్ట్‌ను ఇంత గొప్పగా నిర్వహిస్తున్నారంటూ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌ను ఉప రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. ఉపరాష్ట్రపతి దంపతులను వెంకయ్యనాయుడు, ఉషమ్మలు సన్మానించి, మూడు సింహాల జ్ఞాపిక అందజేశారు. అలాగే గవర్నర్ దంపతులను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్ శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.





స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, పక్కన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య దంపతులు

రైతులు, మహిళల
సాధికారతే మా కల

స్వర్ణభారత్ నిబద్ధతతో కృషి చేస్తోంది ● ట్రస్ట్ వార్షికోత్సవంలో పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



నెల్లూరు (ఆంధ్రజ్యోతి)/ వెంకటాచలం, ఆగస్టు 17 : రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకొని సాధికారతతో సగర్వంగా తలెత్తుకొనేలా చేయాలన్నది స్వర్ణభారత్ కల అని ఆ దిశగా నిబద్ధతతో పని చేస్తోందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం వెంకటాచలంలో జరిగిన స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖండ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూస్నేహితులు, సహచరుల సహకారంతో 23 ఏళ్ల క్రితం స్వర్ణభారత్ ట్రస్ట్‌ను స్థాపించామని గుర్తు చేసుకున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికి లక్ష మందికిపైగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించినట్లు చెప్పారు. నవీన పద్ధతులను, సాంకేతిక విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు పరిచయం చేయడమే ధ్యేయంగా ఈ సంస్థ కృషి చేస్తోందన్నారు. రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకొని సాధికారత సాధించి గర్వంగా తలెత్తుకొని జీవించాలన్నది ట్రస్ట్ కల అన్నారు. అలాగే మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని, సాధికారిత సాధించే దిశగా స్వర్ణభారత్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీని వాసులురెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నేత కామినేని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కందుకూరు సబ్‌కలెక్టర్ బదిలీ

కందుకూరు : కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌గా కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరిని నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడు నెలల క్రితం కందుకూరుకు వచ్చిన ఆమె ఎన్నికల నిర్వహణలో క్రియాశీలంగా పని చేశారు. ఆమె బదిలీ కావడంతో ఎవరిని నియమిస్తారా!? అన్నది చర్చనీయాంశమైంది.

ఉద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్!

● సుమారు 2వేల మందికి స్థానచలనం

నెల్లూరు (హరనాథపురం) : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం.75ను విడుదల చేసింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, ఇతర విభాగాల్లో చానాళ్లుగా తిష్టవేసుకుని ఉన్న ఉద్యోగులందరికీ స్థాన చలనం కలగనుంది. ఎక్కడో జిల్లా మారుమూల ప్రాంతంలో పనిచేస్తున్న వారు జిల్లా కేంద్రానికి వచ్చే అవకాశమూ ఏర్పడనుంది. కాగా, జిల్లాలో 33 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, ప్రభుత్వం బదిలీ చేయాల నుకున్న శాఖలో 12 వేల మంది వరకు ఉన్నట్లు సమాచారం. వీరిలో నిబంధనలు పోను సుమారు రెండు వేల మందికి బదిలీ అవకాశం ఉంది. ఈసారి విద్యా, వైద్యం, ట్రెజరీ తదితర శాఖల ఉద్యోగులకు బదిలీలు ప్రకటించలేదు. కేవలం 15 శాఖలలో మాత్రమే బదిలీల ప్రక్రియ జరగ నుంది. రెవెన్యూ, పంచాయతీరాజ్- గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్, సచివాయాలు, పౌరసరఫరాలు, భూగర్భ గనులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ సిబ్బంది, దేవదాయ, రవాణా, అటవీ, పరిశ్రమలు, ఎనర్జీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్‌అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖల్లో ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి.

వీరికి మినహాయింపు

దృష్టిలోపం ఉన్నవారు, ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్నవారు, దివ్యాంగులు,తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా మినహాయింపు ఇచ్చారు. కారుణ్య నియామకం పొందిన వితంతు ఉద్యోగినికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది.

ప్రమాదంలో 'రాళ్లపాడు'

- క్రస్ట్‌గేట్లను ఆపరేట్ చేయని అధికారులు
- చైన్లు, కౌంటర్ వెయిట్‌లు తెగుతాయని ఆందోళన
- వెంటనే మరమ్మతు చేయాలని రైతాంగం విజ్ఞప్తి

లింగసముద్రం, ఆగస్టు 17: నాలుగు మండలాల్లోని ఆయకట్టుకు సాగు, దాదాపు 100 గ్రామాలకు తాగునీటికి జీవనాడిగా పేరొందిన రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వేలోని క్రస్ట్‌గేట్లకు ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో అధికారికంగా 16,600 ఎకరాలు, అనధికారికంగా మరో 10 వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తారు. సుమారు 16 సంవత్సరాల నుంచి పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్ గేట్లు, 2 పూడు గేట్లను అధికారులు ఆపరేట్ చేయడం లేదు. 2007లో రాళ్లపాడు ప్రాజెక్టుకు భారీ వరద రావడంతో పాత, కొత్త స్పిల్‌వేలోని గేట్లను ఎత్తి మన్నేరుకు నీటిని విడుదల చేశారు. ఆ తరువాత పాత స్పిల్‌వే గేట్లను ట్రయల్ రన్ చేస్తుండగా 1, 3 గేట్ల చైన్లు తెగి కౌంటర్ వెయిట్‌లు కిందపడి పగిలిపోయాయి. దీంతో అధికారులు ఆ రెండు గేట్ల చైన్లు, కౌంటర్ వెయిట్‌లను కొత్తవి ఏర్పాటు చేశారు. అయితే కౌంటర్ వెయిట్లు 1951లో ప్రాజెక్టు నిర్మాణం సమయంలోనివి కావడంతో ఇవి బలహీనంగా ఉన్నాయనే భయంతో 15 ఏళ్లుగా ఈ గేట్లను ఆపరేట్ చేయడం లేదు. కొత్త స్పిల్‌వేలోని 5 గేట్ల ద్వారా 1.7 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉంది. దీంతో ప్రాజెక్టుకు వచ్చే వరద నీటిని ఈ గేట్ల నుంచి మన్నేరుకు విడుదల చేస్తున్నారు. అయితే, వరద పోటెత్తినప్పుడు సామర్థ్యానికి మించి నీటిని విడుదల చేయాల్సి వస్తే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త స్పిల్‌వే గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేయలేదు. 1996లో వచ్చిన భారీ వరదలకు పాత స్పిల్‌వేలోని 7వ నెంబరు గేటు కొట్టుకుపోయింది. దీంతో అధికారులు కొత్త గేటు, కౌంటర్ వెయిట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ గేటు దిమ్మె కింద సున్నం రాలిపోతూ అధికారులను, రైతులను భయపెడుతోంది. ఈ పాత స్పిల్‌వే నిర్మాణ సమయంలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేయలేదు. ఇటీవల నెల్లూరులో జరిగిన జడ్పీ సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు 'రాళ్లపాడు'లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.



రాళ్లపాడు ప్రాజెక్టులో పాత స్పిల్‌వేలోని 16 ఏళ్లుగా ఆపరేట్ చేయని క్రస్ట్ గేట్లు

ఇసుక ఇబ్బందులు రానీయకండి!

జిల్లా యంత్రాంగానికి మంత్రి నారాయణ ఆదేశం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా వాసులకు ఇసుక ఇబ్బం దులు తలెత్తకుండా త్వరితగతిన డీసిల్టేషన్ పాయింట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి నారాయణ అధికారులను ఆదేశిం చారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న మూడు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు తగ్గిపోతున్నందున కొరత ఏర్పడిందన్నారు. వెంటనే జిల్లాలో డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించి వెంటనే ఇసుకను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ డీసిల్టేషన్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్, మైన్స్ డీడీ శ్రీనివాసకుమార్, సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీవో మాలోల తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులోని జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది నిరసన

నిరసనల హోరు!

కోల్‌కతాలో వైద్యవిద్యార్థి నిపై జరిగిన దారుణాన్ని నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది, ప్రజాసంఘాలు ఆగ్రహించాయి. ఉదయం ఆరు గంటలకే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో సాధారణ వైద్యసేవలతో పాటు శస్త్రచికిత్సలు వంటి సేవలను ఆపేసి ఆందోళనబాట పట్టారు. కోల్‌కతా ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్యులపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఊరూరా ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శనలు చేశారు. అనంతరం ప్రధాన కూడళ్లలో బైఠాయించి, నినాదాలతో హోరెత్తించారు.

- కోల్‌కతా ఘటనపై వైద్యులు, పలు సంఘాల ఆగ్రహం
- ఓపీ సేవలు నిలిపివేసి ఆందోళన బాట
- జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు, మానవహారాలు



కందుకూరులో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద..

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 17 : కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బందితోపాటు పలు ప్రజాసంఘాలు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేర కు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుప త్రులలో ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలియచేశారు. నెల్లూరులోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో (జీజీ హెచ్) వైద్యులు, సిబ్బందితోపాటు ఏపీ హెల్త్ అడ్మిని స్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు వైద్యులకు మద్దతు ప్రకటించి నిరసనలో పాల్గొన్నారు. జీజీహెచ్ ఆవరణలోని ప్రసూతి ఆసుపత్రి ఎదుట జరిగిన ఆందోళనలో ఏపీ హంస గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైద్యులపై దేశవ్యాప్తంగా అత్యాచారాలు, అకృత్యాలు చోటు చేసుకోవడం దురదృష్ట కరమన్నారు. ఈ నిరసనలో హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల వెంకటేశ్వర్లు, పీపీయూనిట్ గైనకాలజిస్ట్ ఇంది రా, వైద్యులు స్నిగ్ధ, భవాని, మజురుల్లా, ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వీఆర్‌సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునీల్, నాయకులు షారుక్, ఆశీర్, నవీన్, ఖాదర్, మస్తాన్, ఇతర సంఘాల నేతలు తోఫి, శివ, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు. అలాగే మెడికవర్ ఆసుపత్రిలో కూడా వైద్యులు ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలియచేశారు. ఆ ఆసుపత్రి అధినేత చైర్మన్ డాక్టర్ అనిల్‌కృష్ణ, సెంట్రల్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ యేశ్వత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక నారాయణ వైద్య కళాశాలలో వైద్యులు, సిబ్బంది కూడా ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసరం మినహా ఓపీ సేవలన్నీ ఆపేశారు. ఈ నిరసనలో నారాయణ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ్‌కాంత్, పలు విభాగాల అధిపతులు సంపత్ కుమార్, కొల్లా ప్రవీణ్‌కుమార్, తిలక్ కుమార్, లక్ష్మీరమేష్, ఏజీఎం శేఖర్‌రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, డాక్టర్ రామచంద్రారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సుందరయ్య విగ్రహం నుంచి గాంధీబొమ్మ, పొగతోట వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యా చారిని పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇందులో డాక్టర్ దత్తాత్రేయ, ఐద్వా జిల్లా అధ్యక్షు రాలు మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంగళరావ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌పీ ఆధ్వర్యంలో వైద్యులు సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు రీనా భారతి, కుసుమ కిరణ్, పటాన్ ఇమ్రాన్, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, కొండాపురం వెంకటేశ్వర్లు, షేక్ రసూల్, శాఖవరపు వేణు గోపాల్, గోరంట్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కావలి, కందు కూరు, ఆత్మకూరు, ఉదయగిరి, అల్లూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, పొదలకూరు తదితర ప్రాంతాల్లోనూ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు.



నగరంలోని రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో మూతపడిన ఓపీ విభాగం



రాపూరులో వైద్యుల నిరసన



కావలిలో మానవహారం



నెల్లూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ప్రాంగణంలో మొక్క నాటి నీరుపోస్తున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారాయణ తదితరులు

అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

● రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 17 : భావితరాల మనుగడ కోసం అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు రోడ్డు భవనాల అతిథి గృహం ప్రాంగణంలో అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ భావితరాల మనుగడ కోసం మొక్కలు ఎంతగానో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, కలెక్టర్ ఓ ఆనంద్, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, నగర కమిషనర్ సూర్యతేజ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



చుక్కనీరు లేని సంగం ఎర్రచెరువు

వర్షాభావంతో ఎండిన చెరువులు

సంగం, ఆగస్టు 17 : నైరుతి రుతుపవనాలు ముఖం చాటేశాయి. కారు మబ్బులు కమ్మేస్తున్నా, వర్షం మాత్రం కురవలేదు. దీంతో జిల్లాలోని చెరువులన్నీ అడుగంటాయి. చుక్క నీరు లేక చెరువులు నెర్రెలు బారాయి. రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. మెట్టపల్లెల్లోని చెరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో పశువులకు తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో 1706 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఏ చెరువులోనూ చుక్క నీరు లేదు. భారీ వర్షాలు కురిస్తేగాని వాగులు, వంకలు ప్రవహించి చెరువులకు నీరు చేరే పరిస్థితి లేదు.ముఖ్యంగా మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్‌పేట, ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, ఉదయగిరి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో నూ, అదే విధంగా రాపూరు, కలువాయి, సైదాపురం తదితర మండలాల్లోని చెరువుల్లోనూ వర్షాలు కురిస్తేనే నీరు చేరుతుంది. ప్రస్తుతం కాలువలతోపాటు చెరువుల్లో చుక్క నీరు లేదు. దీంతో పశువులకు తాగునీటి ఎద్దడి ఏర్పడింది. మేతకు వెళ్లిన పశువులకు తాగునీరు కరువై ఇంటికి తోలుకు వస్తున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయానికి శ్రీశైలం జలాశయం నుంచి వరద నీటిని తరలిస్తున్నారు. దీంతో 7 టీఎంసీలు ఉన్న జలాశయం 15 టీఎంసీలకు చేరువలో ఉంది. ఈ పరిణామం ఇటు రైతులతోపాటు, అటు పశుపోషకులకు ఊరట కలిగిస్తుంది. సోమశిల నీటిని చెరువులకు విడుదల చేస్తే కొంత వరకు తాగునీటి ఇక్కట్లు తీరుతాయి.

పిడుగుపాటుకు రైతు మృతి

వరికుంటపాడు, ఆగస్టు 17: జీ.కొత్తపల్లికి చెందిన కుమ్మిత కుమ్మిత కోటయ్య (47) శనివారం పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. తన పొలంలో వరి నాటిస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి తోడు పిడుగు పడడంతో అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● **ఉదయగిరి రూరల్:** గుడినరవ గ్రామానికి చెందిన అంబటి పెద్దబ్రహ్మయ్యకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు కోరారు.

నగరంలో గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైం) : నగరంలోని కపాడిపాలెం రాయపువీధిలోని షేక్ ముంతాజ్ ఇంట్లో సంతపేట పోలీసులు శనివారం 16 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు నెల్లూరు అర్బన్ తహసీల్దారు, మధ్యవర్తుల సమక్షంలో ముంతాజ్ నివాసంలో దాడు లు చేశామన్నారు. ఈ దాడుల్లో 130 గ్రాముల బరువు కలిగిన గంజాయిని స్వాధీనం చేసు కొని ఆమెను అరెస్ట్ చేశామన్నారు. గతంలో ఆమెపై సంతపేట, కలువాయి, నెల్లూరు రూరల్, నెల్లూరు సెబ్, ఆత్మకూరు సెబ్, కోవూరు సెబ్ పోలీసు స్టేషన్‌లలో గంజాయి కేసులున్నాయని పేర్కొన్నారు.

సెలవులో కావలి మున్సిపల్ కమిషనర్

● అప్రూవల్ కోసం ఎదురుచూపులు

కావలి,ఆగస్టు17: కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ ఒక నెల సెలవు పెట్టారు. అయితే ప్రభుత్వ అనుమతి రాకపోవటంతో అందుకోసం ఎదురు చూస్తున్నారు. కమిషనర్ సెల్‌ఫోన్ నెంబరును మున్సిపల్ డీఈ సాయిరాంకు డైవర్ట్ చేశారు. ఆ నెంబరుకు ఎవరు ఫోన్‌చేసినా డీఈ తీసుకుని సమాధానం చెబుతున్నారు. అయితే సెలవు అప్రూవల్ కాకపోవటంతో అధికారిక కార్య క్రమాలకు మాత్రం కమిషనర్ అతికష్టంపై హాజరవుతున్నారు. స్వాతంత్ర్య వేడుకలకు, ఆ మరుసటి రోజు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి, శనివారం డీఎంఏ వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరయ్యారు. అయితే మున్సిపల్ సాధారణ విధులను మాత్రం డీఈకి అప్పగించారు. దీంతో కమిషనర్ సెలవులో ఉన్నట్టా ? లేక విధుల్లో ఉన్నట్టా ? అని పట్టణంలో చర్చ సాగుతోంది.

ఏకపక్షంగా సైదాపురం ఎస్‌ఎంసీ ఎన్నికలు

● **వైసీపీ మద్దతుదారులపై టీడీపీ ఫిర్యాదు**

● **చైర్మన్‌ను ఎంపిక చేయకుండానే వెళ్లిపోయిన వైనం**

సైదాపురం, ఆగస్టు 17: మండలంలో కోరంలేక వాయిదాపడిన సైదాపురం జెడ్పీ హైస్కూల్, రాగన రామాపురం ప్రాథమిక పాఠ శాలకు శనివారం పాఠశాల యాజ మాన్యం కమిటీ ఎన్నికలు నిర్వహిం చారు. ఇందులో సైదాపురం జెడ్పీ హైస్కూల్‌లో టీడీపీ, వైసీపీ మద్దతు దారుల మధ్య పోటీ ఏర్పడింది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారని టీడీపీ మద్దతుదారులు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అంతకముందు ఉదయం పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 24మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇందులో 14మంది వైసీపీ మద్దతుదారులను చైర్మన్ అభ్యర్థిగా ఉండాలని బలపరిచారు. మరోపక్క టీడీపీ మద్దతుదారులకు 10మంది బలపర్చారు. తల్లిదండ్రులను ప్రలోభానికి గురి చేశారంటూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎంఈఓ దయాకర్ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా యం.నీరజ, వైస్ చైర్మన్‌గా రహంతుల్లా, ఆర్‌ఆర్‌పురం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా కూరాకు శారదాదేవి, వైస్ చైర్మన్‌గా హేమలతలు ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం విశేషం.



తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6870
వెండి కిలో ధర	రూ. 86,000
వెండి ఒక గ్రాము	రూ. 89.00

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన

రాపూరు, ఆగస్టు 17: పెంచలకోన క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం 4గంటలకు అభిషేకం, 10.30గంటలకు కల్యాణం, సాయంత్రం 5.30గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహ స్వామికి తిరుచ్చి పల్లకీసేవ ప్రధానార్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యం, గిరిజనుల వాయిద్యాల మధ్య సహస్ర దీపాలంకరణ సేవ (ఊంజల్‌సేవ) వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాట్లు, మంచినీరు సరఫరా, అన్నదానం మొదలగు కార్యక్రమాలు ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేశారు.

రేషనలైజేషన్‌లో గందరగోళం!

జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల స్థానంలో ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు

వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతులు కోల్పోతున్నామని ఆవేదన

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 143 జీవోను రద్దు చేయాలి

డీహెచ్‌కు ఫిర్యాదుల వెల్లువ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 17 : వైద్య ఆరోగ్యశాఖలో గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 143 జీవో ఆధారంగా జరిగిన రేషనలైజేషన్‌లో గందరగోళం నెలకొంది. దీంతో ఈ విధానాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వ చర్యలకు భయపడి దీనిపై నోరుమెదపని ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కంచాలని కోరుతున్నారు. వివరాల మేరకు..

అప్పటి వైసీపీ ప్రభుత్వం 2023 జూలైలో 143 జీవోను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 14 మంది వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు మాత్రమే ఉండాలని నిబంధనలు విధించింది. దీనితో 30 మందికి పైగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేషన్ లైజేషన్ ప్రకారం ప్రస్తుతం 14 మందికే పరిమితం అయ్యారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అందులో 16 పీహెచ్‌సీలలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లను కాదని వారి స్థానంలో ఎల్‌డీ (లోయర్ డివిజన్) కంప్యూటర్ ఆపరేటర్లను నియమించింది. దీనిపై సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి డిగ్రీ పూర్తి చేసి అకౌంట్స్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించిన వారినే జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లుగా నియమించాలి. అయితే అందుకు విరుద్ధంగా కేవలం 10వ తరగతి స్థాయితో నియమితులైన ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లలకు జూనియర్, సీనియర్ అసిస్టెంట్ బాధ్యతలు అప్పగించారు. కేవలం కుటుంబ నియంత్రణ, జనన, మరణ గుర్తింపు కార్డులు ఇచ్చే ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు ఉద్యోగుల జీతభత్యాలు, పేబిల్లు వంటి జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌ల పనులు చేయాల్సి వస్తోంది. ఆయా పనులు చాలా మంది ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లకు తెలియక బయట అకౌంట్స్ తెలిసిన వారితో చేయిస్తున్నట్లు సమాచారం. ఈ నిర్ణయంలోనూ వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగుల ఆగ్రహానికి గురైంది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం చర్యలకు భయపడి చేసేది ఏమిలేక ఉద్యోగ బాధ్యతలు చేపట్టా రు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో నెలకొన్న సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టినట్లు అధికారులు అంటున్నారు.



● **డీహెచ్‌కు ఫిర్యాదు**

గత వైసీపీ ప్రభుత్వం వల్ల తాము ఎదుర్కొన్న ఇబ్బందులను మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హెల్త్ డైరెక్టర్‌ను కలిశారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లు ఎదుర్కొంటున్న కష్టాలు గురించి తెలియచేశారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం రాపూరు, చిత్తలూరు, మల్లాం, గొట్టిప్రోలు, వరగలి, పేర్నాడు, ఈశ్వరవాక, సర్వాయపాళెం, కృష్ణపురం, చిట్టేడు, జొన్నవాడ, పెదపరియ, సౌత్‌మోపూరు, తల్లపూడి, బంగారుపేట, జగదేవిపేట పీహెచ్‌సీలలో ఎల్‌డీ కంప్యూటర్ ఆప రేటర్లు జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌ల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ భారం మోసేందుకు కూడా వారు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు కారణం గా జూనియర్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. కాగా 143 జీవో ప్రకారం పీహెచ్‌సీలలో ఉండాల్సిన ఉద్యోగుల వివరాలు ఇలా ఉన్నాయి.

వైద్యులు, సిబ్బంది	సంఖ్య
వైద్యులు	2
స్టాఫ్‌నర్సులు	3
ఫార్మాసిస్	1
ల్యాబ్ టెక్నీషియన్	1
జూనియర్ అసిస్టెంట్	1
ఎంపీహెచ్‌ఈవో	1
ఎంపీహెచ్ఎస్(ఎఫ్)	3
ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో	1
వాచ్‌మెన్	1
	14

ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భావిస్తున్నాం



గత ప్రభుత్వం విడుదల చేసిన 143 జీవో వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ సమస్యను టీడీపీ ప్రభుత్వం పరిష్కరిస్తుందని భావిస్తున్నాం. అప్పుడే ఉద్యోగులు తమ స్థాయిని బట్టి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ పెంచలయ్య (డీఎంహెచ్‌వో)

143 జీవోను రద్దు చేయాలని డీహెచ్‌కు తెలియజేశాం



గత వైసీపీ ప్రభుత్వం ఏడాది క్రితం తీసుకు వచ్చిన 143 జీవో వల్ల వైద్య ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూనియర్, సీనియర్ ఉద్యోగులు చేయాల్సిన పనిని కేవలం 10వ తరగతి స్థాయి ఉద్యోగులు ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్లు చేయడం దారుణం. దీనిపై డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు వినతిపత్రం ఇచ్చాము. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

- నాగరాజు (మినిస్ట్రీయల్ సర్వీసెస్ అసోసియేషన్)

వాతావరణంలో మార్పులు పంటలపై ప్రభావం

సంగం, ఆగస్టు 17: వాతావరణంలో వచ్చే మార్పులు పంటలపై ప్రభావం చూపుతాయని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ మారుతీదేవి అన్నారు. శనివారం ఆమె స్థానిక వ్యవసాయ అధికారులలతో కలిసి సంగం, తరుణవాయి, వంగల్లు రైతులకు పంటల సాగుల వైవిధ్యంపై అవగాహన కల్పించారు. అతివృష్టి, అనావృష్టితో పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. విచక్షణరహితంగా రసాయన మందులు వాడితే చీడపీడలు పెరుగుతాయన్నారు. అంతరపంటల సాగు, సేంద్రియ సమతుల్య ఎరువుల వాడకం, సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటించాలన్నారు. సుస్థిర ఆదాయం పొందే వరకు మిశ్రమ కూరగాయల సాగు, కోళ్ల పెంపకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో శైలజకుమారి, స్థానిక ఏవో శ్రీహరి, వీఏఏ శిరీష, ప్రనూష, కల్యాణి, గీత, విజయ రైతులు పాల్గొన్నారు.

కంద్రిక వృద్ధాశ్రమంలో మాజీ ఎంపీ లగడపాటి

సంగం, ఆగస్టు 17: అమరపనాయుడు కంద్రికలో తల్లి రామలక్ష్మమ్మ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని శనివారం మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తనయుడితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి వచ్చిన ఆయన్ను స్థానిక టీడీపీ నాయకుడు బాణా శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషారెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన ఆశ్రమంతా కలియ తిరిగి పరిశీలించారు. రాజకీయల గురించి ప్రస్తావించగా తాను రాజకీయాల గురించి మాట్లాడడం లేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, మంత్రులు ఎలా ఉన్నారని ఆయన విలేకరులను ప్రశ్నించారు. అనంతరం తల్లి రామలక్ష్మమ్మ, కుమారుడితో కలిసి నెల్లూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.



తనయుడితో కలిసి ఆశ్రమాన్ని సందర్శిస్తున్న లగడపాటి రాజగోపాల్

ఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

నెల్లూరు(విద్య), ఆగస్టు 17 : ఎంపీసీ స్ట్రీమ్‌లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్ తుది విడత వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత ధ్రువీకరణ పత్రాలు పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. 20 నుంచి 22వ తేదీ వరకు కళాశాలలు, కోర్సుల ఎంపికలు చేసుకోవాలని, 23న ఎంపికలు మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. 26న కళాశాలలు, బ్రాంచ్‌లు కేటాయింపు జాబితా విడుదల చేస్తారని పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 26 నుంచి 30వ తేదీ లోపల సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ఈఏపీసెట్ డాట్ ఏపీఎస్‌సీహెచ్‌ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో లేదా ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 9,844 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.179 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

● వీఎస్‌యూలో మెగా ప్లాంటేషన్

వెంకటాచలం: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శనివారం వీఎస్‌యూ, జనతా ఫౌండేషన్ సంయుక్తంగా మొక్కలునాటే కార్యక్రమం నిర్వహించారు. వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు దాసరి ప్రసాద్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

ఎస్సీ హాస్టల్‌కు ఫ్యాన్లు, లైట్ల వితరణ

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.10వేలు విలువచేసే 3 సీలింగ్ ఫ్యాన్లు, 10 ట్యూబులైట్లు, 3 డోమ్‌లైట్లు దాతలు మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి, కోదండరామిరెడ్డి దంపతులు శనివారం హాస్టల్ వార్డెన్‌కు అందజేశారు. దాతలకు హాస్టల్ వార్డెన్ సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

సూచిక బోర్డులు లేక ప్రమాదాలు

కావలి-దుత్తలూరు హైవే విస్తరణలో భాగంగా కలిగిరికి సమీపంలో టోల్‌ప్లాజా పనులు జరుగుతున్నాయి. అయితే ఆ ప్రదేశంలో రక్షణ నిబంధనలు పట్టించుకోక పోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. టోల్‌ప్లాజా ప్రదేశంలో సూచిక బోర్డులు పెట్టకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించేవాళ్లు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఆ ప్రాంతంలో ఓ కారు కంకరగుట్ట ఎక్కి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో కారు పూర్తిగా దెబ్బతినింది. అదృష్టవశాత్తు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- కలిగిరి



టోల్‌ప్లాజా వద్ద కంకరగుట్టను ఢీకొని ప్రమాదానికి గురైన కారు

తరుణవాయిలో ఓ ఇంట్లో చోరీ

● రెండు సవర్ల బంగారు గొలుసు మాయం

సంగం, ఆగస్టు 17: తరుణవాయిలో సిద్దవరపు శీనయ్య అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో రెండు సవర్ల బంగారు గొలు సు పోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. శీనయ్య రాత్రి భోజనం చేసి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మిద్దె పైన నిద్రించాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగల కొట్టి ఉంది. ఇంట్లో కెళ్లి చూడగా బీరువా పగులగొట్టి బట్టలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అందులో భద్రపరచిన రెండు సవర్ల బంగారు గొలుసు కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో అర్ధరాత్రి దొంగల కలకలం..

స్థానిక శివాలయంలో అర్ధరాత్రి దొంగలు పడ్డారని కలకలం ఏర్పడింది. వివరాల మేరకు.. ఆలయం బయట గేటు వద్ద స్థానిక యువకులు పొద్దుపోయే వరకు మాట్లాడుకుంటుండగా ఆలయ ప్రాంగణంలో రాళ్లు పడ్డాయి. ఈ రాళ్లు శివాలయం వైపు నుంచి వచ్చినట్లు వాచ్‌మెన్ గుర్తించి దొంగలు పడ్డారని కేకలు వేశాడు. యువకులు కర్రలు తీసుకుని లోపల, ప్రహరీ చుట్టూ కలియ తిరిగారు. స్వామి వారి గర్భగుడి వెనుక ప్రహరీపై ఒక జత చెప్పులు కనిపించాయి. వ్యక్తుల ఆచూకీ లేదు. దొంగతనానికి వచ్చిన వ్యక్తులు మనుషుల అలికిడి వినిపించడంతో పరారై ఉంటారని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

రెండో దశ ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

● 21 పాఠశాలల్లో నిర్వహణ ● రెండు చోట్ల వాయిదా

నెల్లూరు(విద్య), ఆగస్టు 17 : పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడా నికి నిర్వహించే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) రెండోదశ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఈనెల 8న జరిగిన తొలి విడతగా ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 29 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీనికి సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితాలను ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉంచి అభ్యంతరాలు స్వీకరించారు. అన్నీ పూర్తయిన తరువాత అందరి ఆమోదంతో విద్యాశాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని 38 మండలాల్లో 2,622 పాఠశాలలు ఉండగా వీటిలో 2,610 పాఠశాలలు ఎన్నికలకు ఎంట్రీలు నమోదు చేసుకోగా వీటిలో విద్యార్థులు లేని కారణంగా 6 పాఠశాలల్లో ఎన్నికలు జరగలేదు. మిగిలిన 2,604 పాఠశాలలకు గానూ 2,020 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 561 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. పలు రకాల కారణాలతో వాయిదా పడిన 23 పాఠశాలల్లో రెండోదశలో 21 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. కాగా నెల్లూరురూరల్ మండలం గొల్లకందుకూరు ఎంపీపీ స్కూల్, వరికుంటపాడు మండలం జంగంరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాలలకు కోరం లేని కారణంగా ఎన్నికలను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో వీటికి కూడా ఎన్నికలు నిర్వహించి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.



కొడవలూరు మండలం వెంకన్నపురంలో ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నారి మృతదేహం గుర్తింపు

కావలిరూరల్, ఆగస్టు17: పట్టణంలోని ముసునూరు సమీపంలో జాతీయ రహదారికి తూర్పువైపున ఉన్న గుంటలో బాలుడి(15నెలలు) మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు, చిన్నారి మృతదేహం నీటిలో తేలియాడుతుండగా స్థానికులు గుర్తించి, ముసునూరు వీఆర్వో శింగరయ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ చిన్నారి వివరాలు తెలియాల్సి ఉంది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాచలం, ఆగస్టు 17: మండలంలోని చవటపాళెం సమీపంలో ఉన్న పంట కాలువలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం పంటకాలువలో గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి ఎవరో, ఎలా చనిపోయాడన్న విషయాలు తెలియాల్సి ఉంది.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతాలో వైద్యురాలి హత్య అమానుషం
- విధులు బహిష్కరించి వైద్యుల నిరసన ర్యాలీలు

సంగం, ఆగస్టు 17: కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ స్థానిక పీఎంపీ, ఆర్‌ఎంపీ, మందుల దుకాణదారులు నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యు లు జగన్మోహన్, తిరుపతిరెడ్డి, నరసింహులు, మహేష్, బాలకృష్ణ, వాసు పాల్గొన్నారు.


ఆత్మకూరు: ర్యాలీలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది


ఉదయగిరి: ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో ఉషా సుందరి, వైద్యులు కిరణ్, బాలాజీ, స్టాఫ్ నర్సులు మస్తాన్, ధనకుమారి పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అనీషా సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వైద్యశాల నుంచి మెయిన్‌బజార్, యూనియన్‌రోడ్డుల మీదుగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు శివరాం, క్షయవ్యాధి ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ నవాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది పాత బస్టాండ్ సెంటర్ నుంచి బంగ్లా సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మాసిలామణి కుటుంబ సభ్యులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్య అధికారులు, సిబ్బంది వైద్యాధికారి మెహబత్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ బస్టాండు వరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించారు. బస్టాండులో ప్రాంతంలో మానవహారం చేపట్టి నినాదాలు చేశారు.

కందుకూరు: పశ్చిమ బెంగాల్లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా కందుకూరులోని ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మెడికల్ సూరింటెండెంట్ ఇంద్రాణి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

వైద్యులకు కావలి ఎమ్మెల్యే సంఘీభావం

కావలి టౌన్: కలకత్తాలో డాక్టర్‌పై హత్యాచారానికి వ్యతిరేకంగా ఐఎంఏ ఆధ్వర్యంలో 24గంటలు వైద్యసేవలు బంద్ చేసి, ప్రభు త్వ ఏరియా వైద్యశాల వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఐఎంఏ కావలి శాఖ అధ్య క్షుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్ర మంలో టీడీపీ నేతలు అలేఖ్య, గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, రాజ్‌కుమార్ చౌదరి, ఏరియా వైద్యశాల డైరెక్టర్లు చవల రామకృష్ణ, లక్ష్మి, పబ్బాసాయి పాల్గొన్నారు. ఏపీవీవీ డాక్టర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి రోహిత్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య శాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అం దించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఉమెన్ ఫోర్స్ జమాతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక వైద్యాధికారులు నిరస న ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి కిరాతంగా హత్యచేసిన మానవ మృగాలను శిక్షించాలని వైద్యులు జిహారిక డిమాండ్ చేశారు. బోగోలు మండలం కోవూరుపల్లి వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, పీహెచ్‌సీ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



బిట్రగుంట : సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు జిహారిక



సంగం: పీఎంపీ, ఆర్‌ఎంపీ, మందుల దుకాణాదారుల ర్యాలీ

విద్యాభివృద్ధికి కృషి


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రమౌళీశ్వరరెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 17: సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదపిల్లల విద్యాభి వృద్ధికి కృషి చేస్తామని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రామిరెడ్డి చంద్రమౌళీ శ్వరరెడ్డి పేర్కొన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధిజల కేంద్రం, లైబ్రరీకి పుస్తకాలు, పర్నిచర్, పెయింటింగ్, ఆధునికీకరించిన డిజిటల్ తరగతి గదులను శనివారం చంద్రమౌళీశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ వో వెంగయ్య, హెచ్‌ఎం నాగలక్ష్మి, విశ్రాంత ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి, సబితారెడ్డి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

చేజర్ల, ఆగస్టు 17: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి మండలంలోని 15గ్రామ సచివాలయాల్లో ఆధార్ కార్డు స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. 20, 21న పెరుమాళ్లపాడు, మడపల్లి, నెర్నూరు, 22, 23తేదీల్లో యనమదల, చిత్తలూరు, పాతపాడు, 24న మాముడూరు, చేజర్ల, ఆదురుపల్లి సచివాలయాల్లో క్యాంపులు ఉంటాయని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొగాకు రహిత సమాజానికి పాటుపడదాం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17: పొగాకు రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మేకపాటి గౌ తం రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల నుంచి పట్టణంలోని ప్రధానవీధుల్లో అధ్యాపకులు, విద్యార్థులతో ప్లేకార్డులతో నినాదాలతో చూస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా క్యాన్సర్‌తో మరణిస్తున్న వారిలో 25శాతం మంది పొగాకును వాడే వ్యక్తులు ఉన్నారని తెలిపారు. పొగాకు వాడితే సంతానోత్పత్తి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమేష్, వైద్యులు హీన, సీనియర్ ప్రొఫెసర్ పాల్, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అర్హులందరికీ ట్రై సైకిళ్లు, కృత్రిమ పరికరాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17: జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా బ్యా టరీ ట్రై సైకిళ్లు, కృత్రిమ పరికరాలు అందజేయనున్నట్లు శనివారం ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి విశ్వం పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో కలిసి అర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్ర మాలు చేపట్టా మన్నారు. అలాగే జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో దివ్యాంగుల్లో అర్హుల ఎం పిక చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లో పూర్తయిందని, ప్రస్తుతం ఉదయగిరి నియోజకవర్గంలో ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కరీముల్లా, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు నారాయణ, శివ పాల్గొన్నారు.


వివరాలు సేకరిస్తున్న విశ్వం

వైభవంగా గ్రామోత్సవం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17: కృష్ణంపల్లి సీతారామచంద్ర ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామస్థులు విగ్రహాల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివార్లకు క్షీర, పుష్ప, ధాన్యాధివాసములు, మంగళహారతి, తదితర పూజలు చేశారు. ఉత్సవాల్లో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

మొగిలిచెర్లలో ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

లింగసముద్రం, ఆగస్టు 17: మండలంలోని మొగిలిచెర్లలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) పాలకవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో విజయం సాధించినవారంతా టీడీపీ మద్దతుదారులేనని గోపాలరావు చెప్పారు. కమిటీ చైర్మన్‌గా మద్దులూరి మల్లికార్జునరావు, వైస్ చైర్మన్‌గా షేక్ అస్మా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు వేముల రామారావు తదితరులు పాల్గొన్నారు.

- పూర్తయిన నేకునాంపేట ఎస్ఎంసీ ఎన్నిక

కొండాపురం: మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎంపిక శనివారం పూర్తయింది. టీడీపీ, జనసేన మధ్య పోటీ నెలకొనడంతో ఎన్నిక ఉత్కంఠగా జరిగింది. చైర్మన్‌గా నలగట్ల నాగేంద్ర, వైస్‌చైర్మన్‌గా పఠాన్ మహబున్నీలను సభ్యులు ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయిని మారుతి వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ఎంఈవో-2 ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- అయ్యవారిపల్లె ఎస్ఎంసీ చైర్మన్‌గా మాలకొండ్రాయుడు

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా మంచాల మాకొండ్రాయుడు, వైస్‌చైర్మన్‌గా తలపల కుమారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు హెచ్‌ఎం మేడికొండ ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ఎంసీని హెచ్‌ఎం, టీచర్లు అభినందించారు.

- మళ్లీ ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా

వరికుంటపాడు : ఈ నెల 8న పాఠశాలలో వాయిదా పడిన పాఠశాలలో తిరిగి శనివారం ఎన్నికలు నిర్వహించారు. అందులో భాగంగా జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో తిరిగి మరోమారు ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎంఈవో షావుద్దీన్ తెలిపారు. అలాగే తూర్పు బోయమడగల ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా మలికి భాగ్యమ్మ, వైస్ చైర్మన్‌గా గొల్లపల్లి విజయమ్మలు ఎన్నికయ్యారు. మహమ్మదాపురం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా లక్ష్మిశెట్టి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా సీహెచ్ సుబ్బలక్ష్మమ్మ ఎన్నికయ్యారు. అనంతరం నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు.


లింగసముద్రం : మొగిలిచెర్లలో ఎస్ఎంసీ చైర్మన్, కార్యవర్గ సభ్యుల ప్రతిజ్ఞ


వలేటివారిపాలెం : అయ్యవారిపల్లెలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులతో టీచర్లు


వీకే పాడు : తూర్పుబోయమడగలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు

మాలకొండ ఆదాయం రూ. 18,29,025

వలేటివారిపాలెం, ఆగస్టు 17 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 18,29,025 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,850, కుంకుమార్చన ద్వారా రూ. 29,920, వివాహాల ద్వారా రూ. 12 వేలు, తలనీలాల ద్వారా రూ. 65,400, వాహనపూజల ద్వారా రూ. 6,180, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 4,11,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 500, రూముఅద్దెల ద్వారా రూ. 33,410, కవర్ల ద్వారా రూ. 10,200, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,04,985, అన్నదానం ద్వారా రూ. 10,27,963, విరాళాల ద్వారా రూ. 18,717 ఆదాయం లభించినట్లు తెలిపారు కాగా వలేటివారిపాలెంకి చెందిన వలేటి నాగేశ్వరరావు - ఆదిలక్ష్మి దంపతులు అన్నదానానికి రూ.3,60,000 విరాళం అందజేసినట్లు ఆలయ డీసీ తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

వలేటివారిపాలెం, ఆగస్టు 17: మండలంలోని లింగపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గొర్రెపాటి రాజబాబు శనివారం నోటు పుస్తకాలు, పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజబాబుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 17 : మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి అక్రమంగా పట్టపగలే ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా సమాచారం రావడంతో శనివారం సాయంత్రం 5.30 గంటల సమీపంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది వాగులో ఇసుక నింపుకొని వెళుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని డ్రైవర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీబాబు తెలిపారు.అలాగే శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు కందుకూరు ఎస్ఈబీ ఎస్ఐ దీప్తికరంత్, సిబ్బంది మన్నేరులో ఇసుక నింపుకొని వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.అనంతరం ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. ఆయన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

కరేడు జగనన్న కాలనీపై విచారణ జరపాలి

ఉలవపాడు, ఆగస్టు 17 : మండలంలోని కరేడు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగాయని మాజీ ఎంపీటీసీ మిరియం శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు ఈ విషయమై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్లు లేని అర్హులకు ఇళ్ల స్థలాలను కేటాయించకుండా అనర్హులకు పట్టాలు ఇచ్చి నిరుపేదలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. అనర్హులైన వలంటీర్లు కూడా అడ్డదారుల్లో ఇళ్ల స్థలాలు పొందారని, వీటన్నింటిపై స్థానిక ఎమ్మెల్యే విచారణకు ఆదేశిస్తే నిజనిజాలు బయటకు వస్తాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తీరప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి : ఎమ్మెల్యే కావ్య

అల్లూరు, ఆగస్టు 17 : తీరప్రాంత గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరు మండలం వ్యవసాయంపై ఆధారపడినందున సాగు, తాగునీరు సమృద్ధిగా అందించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వెంటనే నిర్మించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో పచ్చిరొట్టపైర్ల విత్తనాలను అందించామని, మరింతమంది రైతులకు సబ్సిడీపై వీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం అన్ని శాఖల అధికారుల నివేదికలను ఆయన తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, జడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

మహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం

కొండాపురం, ఆగస్టు 17: మండలంలోని కుంకువారిపాలెంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని రెండోరోజు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, పూలంగిసేవ, మాలమంత్రహోమం, లక్ష్మీసహస్రనామ హోమాలను వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను భక్తులకు అందచేశారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


యాగంలో పాల్గొన్న భక్తులు

ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, ఆగస్టు 17: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. జువ్వలదిన్నె వడ్డిపాలెం పెనుకొండమ్మ మహిళా కోలాట బృందం వారి నృత్యప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. టీపీ గూడూరు మండలం పేడూరుకు చెందిన ఎం. సురేష్-సునందన దంపతులు అన్నదాన ఉభయ కర్తలుగా వ్యవహరించారు. కాగా ఆలయ ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ ఈనెల 19న శ్రావణపౌర్ణమి సందర్భంగా స్వామివారికి గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చూడాలి

కావలిటౌన్, ఆగస్టు 17: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో గోవిందయ్య పేర్కొన్నారు. 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం ఆయన సందర్శించి, మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులను చెడు అలవాట్లకు ఎలా దూరంగా ఉంచాలి, వాటికి బానిసలు కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసారు. 5వ వార్డు పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

బోగోలులో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే


బోగోలులో వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్

బిట్రగుంట, ఆగస్టు 17: బోగోలు బజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తున్నది. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని రైల్వే ఉద్యోగులు పేర్కొన్నారు. మూడోలైన్ ప్రారంభించింది మొదలు రైళ్లు, గూడ్సు బండ్ల కోసం అరగంట నుంచి గంటవరకు ఎల్సీగేట్ 144 వేస్తున్నారని తెలిపారు. విధులకు వెళ్లేందుకు మరోమార్గం లేక పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. మరోవైపు రైల్వే గేటుకు తూర్పున రోడ్డుకు అడ్డంగా ఆటోలు, మోటర్‌సైకిళ్లు పెటడ్డం కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు.

రోడ్డు అడ్డగించి, ఇబ్బందులు పెడుతున్నారు..!

కావలి రూరల్ : ముప్పై అడుగుల రోడ్డును ఆక్రమించి, ఉన్న రహదారిపై కూడా వాహనాలు, రాళ్లు అడ్డంపెట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని కావలి మండలం తుమ్మలపెంట వాసులు వాపోతున్నారు. తుమ్మలపెంటలోని గురుకుల పాఠశాల ఎదురుగా 30 అడుగుల రోడ్డును, సుమారు 15 అడుగుల మేర ఆక్రమించి గోడకట్టి మొక్కలు నాటారన్నారు. మిగిలిన రోడ్డుకు వాహనాలు, రాళ్లు అడ్డు పెట్టి ఇబ్బందులు పెడుతున్నట్లు స్థానికులు వాపోయారు. ఇదేమని ప్రశ్నిస్తే 'ఇది మారోడ్డు ఇటు రావటానికి వీలులేదు' అంటూ అడ్డుకుంటున్నారని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలు, రాళ్లు


కొవ్వొత్తులతో జనసేన నేతల నివాళి


ప్రభుత్వ వైద్యుల నిరసనకు సంఘీభావం తెలుపుతున్న జనసైనికులు



కోవూరులో ఆందోళన చేస్తున్న వైద్యులు

కామాంధులను కఠినంగా శిక్షించాలి

జూడాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 17: కోల్‌కతాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జూనియర్ వైద్యులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి కరెంట్ ఆఫీస్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీరస్ జోయల్, కార్యదర్శి డాక్టర్ హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉత్తమ్‌కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ అబిద్ అహ్మద్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నగరంలోని గాంధీ విగ్రహం నుంచి వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కోలా విజయలక్ష్మి, నాగరత్నం యాదవ్ పాల్గొన్నారు.

వైద్యుల నిరసనకు జనసేన సంఘీభావం

కోలకత్తాలో డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని జనసేన పార్టీ తరపున ఖండిస్తున్నామని ఆపార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో వైద్యులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి జనసేన నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ ఆలియా, అజయ్‌బాబు, ఉదయ్‌కిరణ్, పెడాడ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

●**కోవూరు:** స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యులు తహసీల్దారు కార్యాలయం వరకు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారు నిర్మలానంద బాబాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంటు విజేత, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ చలపతి, సలారుద్దీన్, భారతి, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, సాలూరు వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు గాదిరాజు అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి నుంచి చెన్నూరు రోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బుచ్చి సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ పద్మజ, వైద్యులు పాల్గొన్నారు.

●**పొదలకూరు:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలతో పట్టణంలోని గేట్ సెంటర్ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గేట్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ కిరణ్ రిషిత, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●**తోటపల్లిగూడూరు:** మండలంలోని వరిగొండ పీహెచ్‌సీ, కోడూరు పీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, డాక్టర్ సింధు మేఘన, ఫార్మాసిస్టు ఇస్మాయిల్, హెచ్ ఈవో కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ కృష్ణయ్య, ఏఎన్‌ఎం హైమావతి, తదితర మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●**రాపూరు:** పట్టణ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. దోషులను శిక్షించాలంటూ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శ్యాంసుందర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు హరీష్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●**సైదాపురం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. కలకత్తాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రి సమ యంలో విధులు నిర్వహిస్తున్న పీజీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నిత్యప్రశాంతి, శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బుచ్చిలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది


పొదలకూరు: నిరసన తెలుపుతున్న సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది


తోటపల్లిగూడూరు: నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు


స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపరాష్ట్రపతి, గవర్నర్ దంపతులు

స్వర్ణభారత్ సంబరం!

● అట్టహాసంగా ట్రస్ట్ వార్షికోత్సవం

వెంకటాచలం, ఆగస్టు 17 : స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ట్రస్ట్ స్ఫూర్తిప్రదాత వెంకయ్యనాయుడు సారథ్యంలో ఆయన కుమార్తె దీపావెంకట్ పర్యవేక్షణలో ఉపాధి రంగాల్లో ఎంతోమందికి శిక్షణ ఇచ్చి వారి జీవితాల్లో కాంతిని నిలిపింది. పేదలకు దన్నుగా నిలిచిన స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు పాల్గొని ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు గ్రామీణ సాధికారత అడ్మిన్ భవనాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. తొలుత ట్రస్ట్ ప్రాంగణంలో మొక్కలు నాటి, స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ 23 వసంతాల సేవా ప్రస్థానం, వెంకయ్యనాయుడు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. స్వర్ణభారత్ ట్రస్ట్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న జైపూర్ ఉచిత శిబిరాన్ని సందర్శించి కొందరికి కృత్రిమ అవయవాలను అందజేశారు. అనంతరం దంత,సాధారణ వైద్యశాలలను సందర్శించారు.


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

● **ప్రముఖుల సందడి**

స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ దంపతులు, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కామినేని శ్రీనివాస్ వంటి వారితోపాటు ఉన్నతాధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు విచ్చేయడంతో సందడి నెలకొంది. కాగా, పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **అన్నక్యాంటీన్‌కు విరాళం**

నెల్లూరు (సాంస్కృతికం) : గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి ఎస్‌కె.ఖాసీం అన్నా క్యాంటీన్‌కు ప్రతి నెల తన పింఛన్‌లో రూ.5వేలను విరాళంగా ప్రకటించారు. శనివారం నగరా నికి విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి ఆగస్టు నెల విరాళంను భారత్ సేవా ఫౌండేషన్ తరఫున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను గవర్నర్ అభినందించారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోసూరు బాలయ్య గౌడ్, నాయకులు చీమలదిన్నె మహేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.


కృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులతో ...

పుంజులూరుపాడు ఎస్‌ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

వెంకటాచలం, ఆగస్టు 17: మండలంలోని పుంజులూరుపాడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ చైర్మన్‌గా దాసి వనజమ్మ, వైస్ చైర్మన్‌గా ఉడత జాన్సీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వెంకటకృష్ణమనాయుడు, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మహేంద్రనాయుడు, చెంగయ్యనాయుడు, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన విద్యా కమిటీ ఎన్నిక

మనుబోలు, ఆగస్టు 17: పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఈనెల 8వ తేదీన నిర్వహించాల్సిన విద్యాకమిటీ ఎన్నిక రాజకీయ నాయకుల వివాదాలతో అర్థాంతరంగా ఆగింది. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్ణయం మేరకు శనివారం ఎన్నిక ప్రక్రియను ఉపాధ్యాయులు సీఎంవో పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్మన్‌గా పోతుగుంట రమీజా, వైస్ చైర్మన్‌గా మందా శీనయ్య, కోఆప్షన్ సభ్యులుగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, అంబటి శ్రీనువాసులురెడ్డి, ఎక్స్‌ఆఫిషియో సభ్యురాలుగా డి భారతిని ఎన్నుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనువాసులురెడ్డి తెలిపారు. ఈ ఎన్నికలను ఇన్‌చార్జి ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఎన్నికల అనంతరం సీఎంవో మధ్యాహ్న భోజనం రుచిచూసి పిల్లలు పాఠశాలల్లోనే భోజనం చేయాలని తెలిపారు.

పశువుల సంతకు వేలం పాట

● రూ. 12.10 లక్షలకు దక్కించుకున్న టీడీపీ నేత


పాటదారుడికి హక్కుపత్రం అందిస్తున్న ఈవోఆర్డీ

మనుబోలు, ఆగస్టు 17: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం పశువుల సంత వేలంపాటను పంచాయతీ అధికారులు నిర్వహించారు. ఈవేలం పాటలో ధరావత్తు చెల్లించి పది మంది పాటదారులు పాల్గొన్నారు. సర్పంచు కంచి పద్మమ్మ అధ్యక్షతన వేలంపాటను ప్రారంభించగా రూ.12.10 లక్షలకు టీడీపీ గ్రామ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య దక్కించుకున్నారు. ఆయనకు ఏడాది పాటు హక్కు కల్పిస్తూ ఈవోఆర్డీ జీవిఎస్‌వి ప్రసాద్, ఇన్‌చార్జి కార్యదర్శి చెంచుప్రసాద్ పత్రాన్ని అందజేశారు. వెంకటరమణయ్యను టీడీపీ నాయకులు ఉడతా విజయ్‌కుమార్, దండుచంద్రశేఖర్‌రెడ్డి, చెల్లగిరి ప్రసాద్‌లు అభినందించారు.

వెంకయ్యనాయుడిని కలిసిన బీజేపీ నేతలు

వెంకటాచలం, ఆగస్టు 17: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉన్న పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అసనాపురం శ్రీనివాసులు, పిల్లిపాకుల పెంచలయ్య తదితరులున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విడవలూరు, ఆగస్టు 17: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రామతీర్థం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. వావిళ్ల గ్రామంలోని గిరిజన కాలనీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముత్తుకూరు, ఆగస్టు 17 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. శనివారం మండలంలోని బ్రహ్మదేవి జడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు వాణిభవానీనాయుడు, సందూరి శ్రీహరి, రహీమ్, అశోక్, సుమన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 17: ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం బుచ్చి మున్సిపాలిటీ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్ బాబు ఆధ్వర్యంలో బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. కోవూరు నియోజకవర్గ కన్వీనర్ ఇండ్ల వెంకటరామవేంద్రరావు పలు అంశాలపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఆలూరు నాగవేణి, జడపల్లి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి ?

● మండల సమావేశంలో ఎంపీటీసీ ఆగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 17: మండల సర్వసభ్య సమావేశానికి అధికారులే గైర్హాజరైతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పెనుబల్లి ఎంపీటీసీ వినయ్‌నారాయణ ఎంపీడీవోని నిలదీశారు. శనివారం బుచ్చి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసులు అధ్యక్షతన వైస్ ఎంపీపీ ఎస్ కీర్తన, ఎంపీడీఓ నరసింహరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పెనుబల్లి ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈసారి సమావేశానికి అన్ని శాఖల అధికారులు రాకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు, చేపట్టిన పనులు, తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మినగల్లు సర్పంచు పూజిత, ఎంపీటీసీలు, పంచాయతీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపురోత్సవం


రంగనాథస్వామి ఆలయంలో గోపురోత్సవం


పుష్ప పల్లకీ ఉత్సవంలో వేంకటేశ్వరస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17: తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు 5వ రోజుకి చేరాయి. ఉదయం నిత్యహోమాలు, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం గోపురో త్సవం, రాత్రి హోమాలు జరిగాయి. ఉభయకర్తలుగా ఆరణి కందప్పమేస్త్రీ సత్రం ఈవో ఏ.రాధాకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

● మూలస్థానేశ్వరాలయంలో త్రయోదశి సందర్భంగా నందీశ్వరుడికి సాయంత్రం ప్రదోషకాల పూజలు జరిగాయి. వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, పంచామృతాభిషేకాలు, విశేష అలం కారం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో, జిల్లా సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో శనివారం రాత్రి శ్రీకృష్ణస్వామికి పల్లకీసేవ ఘనంగా జరిగింది.

● మాగుంట లే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. రాత్రి గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి పుష్ప పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శబరి శ్రీరామక్షేత్రం వార్షికోత్సవం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17 : నగరంలోని దివ్య ఆధ్యాత్మిక కేంద్రం శబరి శ్రీరామక్షేత్రం 24వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి సారథ్యంలో హనుమత్‌సీతాలక్ష్మణ సహిత శ్రీకోదండరామ స్వామిలకు పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం శాంతి హోమం, సామూహిక లక్ష తులసీదళ అర్చన కనుల పండువగా జరిగాయి. పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం సీతారాముల కల్యాణం, రాత్రి ఆంజనేయస్వామికి పల్లకీసేవ, హారతి తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను చంద్రారెడ్డి, సుబ్బరాజు, అన్నం దయాకర్‌గౌడ్, దద్దోలు రమణయ్య, అర్చకులు నరేష్‌స్వామి, తదితరులు పర్యవేక్షించారు.

16 నెలలు కొబ్బరికాయలు కొట్టి సరిపెట్టేశారు!

● వైసీపీ నాయకులపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఆగస్టు 17 : అభివృద్ధి పేరిట వైసీపీ నాయకులు ఎన్నిక లకు ముందు 16 నెలలు కొబ్బరికాయలు కొట్టి సరిపెట్టేశారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం 21వ డివిజన్ మాగుంట లేఅవుట్‌లో సీసీరోడ్డు కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పుడు చేసిన శంకుస్థాపనలకు పనులు పూర్తి చేసి త్వరలో ప్రారంభోత్సవాలు చేస్తామని తెలిపారు. ఈ డివిజన్‌కు మరో 2 నెలల్లో రూ.50 లక్షలు కేటాయించనున్నామన్నారు.

● **టూరిస్టులకు బుద్ధి చెప్పారు : గిరిధర్‌రెడ్డి**

డబ్బులిస్తే ఓట్లేస్తారంటూ ఇప్పటి వరకు రాజకీయాల్లో చెలామణి అవుతున్న టూరిస్టు రాజకీయ నాయకులకు ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కలివెలపాళెంలో నూతనంగా ఏర్పా టు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానికంగా శంకర నేత్రలయం అందిస్తున్న సేవలను అభినందించారు. సౌత్‌మోపూరు, ఆమంచర్ల గ్రామాలలోనూ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్యను బోధించాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 17: ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆట పాటల ద్వారా విద్యాబోధన చేస్తే ఆసక్తితో సులభతరంగా అవగాహన చేసుకుంటారని ఎంఈఓ ఎం దిలీప్‌కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్, హైస్కూలు, బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను ఎంఈఓ పరిశీలించారు. ఈ నెల 19నుంచి ప్రతి పాఠశాలలో టూల్ ప్రోగ్రాం అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, మహేష్, శీనయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 17 : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయంలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు టి.రమేష్‌బాబు, కోశాధికారి గడ్డం హనోక్, ఉపాధ్యక్షుడు దయాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

నెల్లూరు(విద్య), ఆగస్టు 17: నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని నోడల్ రీసోర్స్ సెంటర్‌లో కంటెంట్ డెవలప్‌మెంట్‌పై అధ్యాపకులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి మాట్లాడుతూ 7 రోజుల పాటు అధ్యాపకులకు వీడియో మేకింగ్, ఎడిటింగ్, ఆడియో, వీడియో పిపిటి క్రియేషన్ వంటి అంశాలపై శిక్షణ అందించారన్నారు. జిల్లా వ్యాప్తంగా 155 మంది అధ్యాపకులు హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకున్నారన్నారు. శిక్షణా తరగతులకు కన్వీనర్‌గా వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, మాస్టర్ ట్రైనర్స్‌గా డాక్టర్ ఐఎస్.చక్రపాణి, డాక్టర్ టి.రంజని, టి.మౌనిక, జి.యుగంధర్, జేకేసీ మెంటర్‌గా వేణు వ్యవహరించారు.

రూరల్ సీఐగా వేణు

నెల్లూరురూరల్, ఆగస్టు 17: నెల్లూరురూరల్ సీఐగా గుంజి వేణు శనివారం బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, పోలీసులకు స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్నారు. అప్పుడే నేరాలు కట్టడవుతాయని వెల్లడించారు. గ్రా మీణ, పట్టణ ప్రాంతాల్లో శాంతిభద్రతలు కాపాడడమే తన లక్ష్యమని తెలిపారు. రూరల్లోని ప్రజలుకు తమ సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉంటారని, వారి ఇబ్బందులు తమతో పంచుకోవచ్చున్నారు. అనంతరం స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎంపీపీ మృతి

విడవలూరు, ఆగస్టు 17: విడవలూరు మండల ప్రజాపరిషత్ మాజీ అధ్యక్షురాలు తుళ్లూరు నారాయణమ్మ (75) శనివారం స్వగ్రామమైన వావిళ్లలో అనారోగ్యంతో మృతిచెందారు. మృతిరాలి కోరిక మేరకు ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. మనసేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతురాలి నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు వేణు, నాగేశ్వరరావు సేకరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● రహదారి మధ్యలో డివైడర్ పైకెక్కిన లారీ


డివైడర్ పైకెక్కిన లారీ

నెల్లూరురూరల్, ఆగస్టు 17 : నెల్లూరు - ముత్తుకూరు రహదారిలో గుండ్లపాళెం వద్ద శుక్రవారం అర్ధరాత్రి త్రుటిలో ప్రమాదం తప్పింది. ముత్తుకూరు వద్ద థర్మల్ పరిశ్రమల్లో బూడిదను సిమెంట్ తయారీకి తీసుకెళ్లేందుకు వస్తున్న లారీ గుండ్లపాళెం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్ పైకెక్కి కొంతదూరం ప్రయాణించి ఆగిపోయింది. ఈ ఘటనలో వాహన రాకపోకలు తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పినట్లు స్థానికులు అంటున్నారు. లారీ ప్రస్తుతం అక్కడే ఉండగా డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. బైక్ ర్యాలీ చేస్తూ జూడాల నిరసన





జూడాలకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్ శిరీష తదితరులు



రక్షణకోసం రోడ్డెక్కారు!

● స్విమ్స్, రుయా జూనియర్ డాక్టర్ల బైక్ ర్యాలీ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 17 : మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని జూనియర్ డాక్టర్లు (జూడాలు) డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టరు హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని స్విమ్స్, రుయాస్పత్రిలోని జూడాలు రుయాస్పత్రి ఆవరణలో శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టారు. విధుల్లో ఉన్న జూనియర్ డాక్టరుపై ఇంతటి అఘాయిత్యం జరిగినా ప్రభుత్వాలు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అమానుషమన్నారు. ఇలాంటి దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా డాక్టర్లకు కొత్త రక్షణ చట్టాలను వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం ప్లకార్డులు చేత బట్టి నినాదాలు చేస్తూ ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు స్విమ్స్ అత్యవసర విభాగం ముందు నిరసన కార్యక్రమాలను నిర్వహించి.. అక్కడినుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా రుయాస్పత్రికి చేరుకున్నారు. అక్కడ రుయాస్పత్రిలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లతో కలిసి ద్విచక్ర వాహనాలపై నినాదాలు చేస్తూ టౌన్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మేయర్, ఎమ్మెల్సీ, పలు యూనియన్ల మద్దతు

రుయాస్పత్రిలో జూడాలు నిర్వహిస్తున్న నిరసనకు మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మద్దతుగా నిలిచారు. వారు మాట్లాడుతూ.. విధుల్లోని వైద్యులపై ఇటీవల దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయకపోవడం వల్లే కోల్‌కతాలో ఇలాంటి అమానుష ఘటన జరిగిందన్నారు. అలాగే ఏపీఎన్జీవోస్, ఏపీ హంస, ఏపీ నర్సింగ్ అసోసియేషన్, తిరుపతి ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్, ఏఐటీయూసీ సంఘాల నేతలు కూడా మద్దతు తెలిపారు. ఏపీఎన్జీవోస్, ఏపీ హంస నేతలు నైనారు వరప్రసాద్, రాజా మాట్లాడుతూ.. మహిళా డాక్టరుపై ఇంతటి అమానుష ఘటన జరగడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబీకులకు సమాజం తరపున క్షమాపణలు తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిచిన ఓపీడీ సేవలు

జూడా హత్యను వ్యతిరేకిస్తూ ఐఎంఏ పిలుపుతో జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో శనివారం ఓపీడీ సేవలను నిలిపేశారు. కేవలం అత్యవసర సేవలు మినహా ఓపీడీ, సాధారణ శస్త్ర చికిత్సలను పూర్తి స్థాయిలో నిలిపేసి ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యం సంఘీభావాన్ని వ్యక్తం చేసింది. జూనియర్ డాక్టరు హత్యపై న్యాయం జరిగే వరకు పోరాటం తీవ్రతరం చేస్తామని ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్విమ్స్‌లో ఎపిలెప్సీ క్యాంపు వాయిదా

స్విమ్స్‌లోని న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రతి మూడో ఆదివారం నిర్వహించే ఎపిలెప్సీ క్యాంపు (మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందుల పంపిణీ)ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో జరిగిన జూనియర్ డాక్టరు హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుతో రెండ్రోజులుగా కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసన వల్ల ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

తిరుపతి(విద్య): జూనియర్ డాక్టర్‌పై హత్యాచారంపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోనూ విద్యార్థులు తిరుపతిలో శనివారం ర్యాలీ, నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా ఎంఆర్‌పల్లె కూడలిలోని దండు మార్ వి్గ్రహం వద్ద నిరసన తెలిపి, అక్కడినుంచి అన్నమయ్య సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. నాయకులు అక్బర్, నవీన్ మాట్లాడుతూ.. ఘటన జరిగి ఎనిమిది రోజులు గడుస్తున్నా కేసులో ఏమాత్రం పురోగతి లేదన్నారు. దీనికంతటికీ బాధ్యత వహిస్తూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వినోద్, నరేంద్ర, బాల, వీరేష్, వినయ్, ఓంరాజు, శ్రీహరి, మోహన్, చంద్రనాయక్, బాషా, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

గాదంకి టోల్‌ప్లాజా వద్ద
గంజాయి కలకలం

కారు డిక్కీ నుంచి రోడ్డుపైపడ్డ రెండు ప్యాకెట్లు



పాకాల/చంద్రగిరి, ఆగస్టు 17: రెండు గంజాయి ప్యాకెట్లు కారు డిక్కీ నుంచి రోడ్డుపైపడిన ఘటన గాదంకి టోల్ ప్లాజా వద్ద శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, టోల్ ప్లాజా అధికారుల సమాచారం మేరకు.. శనివారం రాత్రి పాకాల మండలం గాదంకి సమీపంలోని టోల్‌ప్లాజా స్పీడ్ బ్రేకర్ వద్ద తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ముదురు నీలి రంగు కారు డిక్కీ నుంచి రెండు ప్యాకెట్లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. ఆ తర్వాత కారు అతివేగంగా వెళ్లిపోయింది. దీన్ని టోల్ సిబ్బంది గమనించి.. ప్యాకెట్లను పరిశీలించగా, అందులో గంజాయి కనిపించింది. వెంటనే ఐడీ పార్టీ పోలీసులకు సమాచారం అందించారు. కారు వేగంగా వెళ్లడం, డిక్కీలో నుంచి ప్యాకెట్లు ఎగిరిపడటం టోల్‌గేట్ సీసీ కెమెరాలో రికార్డు అయింది. కారు డిక్కీ నిండా ప్యాకెట్లు ఉండటం వల్లే డోర్ పూర్తిగా లాక్ పడలేదని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈసంఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

యంత్రభూతానికి బలైన చిన్నారి



నవ్యశ్రీ

వాకాడు, ఆగస్టు 17 : కోలాటమాడడానికి వెళ్లిన ఓ చిన్నారి యంత్ర భూతానికి బలైపోయింది.వాకాడులో ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు... చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మర్రిమాకుల కండ్రిగకు చెందిన బండి నవ్యశ్రీ (11) మరో 20మందితో కలసి తిరుపతి జిల్లా వాకాడులోని మహాలక్ష్మి ఆలయంలో తిరునాళ్లకు కోలాటం వేయడానికి శుక్రవారం వచ్చింది. కోలాటమాడి అలసిపోయిన ఆమె తెల్లవారుజామున జనరేటర్ పక్కనే పడుకుంది. అది ఓపెన్‌టైపు జనరేటర్ కావడంతో ఫ్యాన్‌లో పక్కనే పడుకొని ఉన్న నవ్యశ్రీ జడ చిక్కుకుంది. ఒక్కసారిగా తల మొత్తం జనరేటర్‌లోకి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది.విగతజీవిగా పడి ఉన్న నవ్యశ్రీని చూసి ఆమెతో వచ్చినవారు కన్నీరుమున్నీరయ్యారు.

దోషం దందా

ముక్కంటి ఆలయంలో ఆగని వసూళ్లపర్వం



రూ.500 రాహుకేతు మండపం వద్ద బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 17 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులను దోపిడీ చేయడం ఆగడమేలేదు. ప్రత్యేకించి రాహుకేతు పూజల్లో భక్తుల నుంచి బలవంతపు వసూళ్లు విచ్చలవిడిగా సాగిస్తూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో ఒక దోషపూజల విభాగంలోనే రూ.50కోట్లకు పైగా అక్రమ సొమ్మును పోగేసి అప్పటి పాలకులు, అధికారులు పంచుకున్నారన్నది బహిరంగ రహస్యం.కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయంలో అధికారులు కొద్దిరోజుల పాటు ఈ దందాలను పక్కన పెట్టారు. అక్రమ సంపాదనకు అలవాటుపడిన సిబ్బంది మళ్లీ బహిరంగ వసూళ్లకు తెరతీశారు. అయితే ఈసారి దోష పూజల్లో దక్షిణకు పక్కాగా అధిక ధరలు కేటాయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.గ్రహణకాల అభిషేకాలను దర్శించుకోవడానికి,రాహుకేతు సర్పదోష పూజలు జరిపించుకునేందుకు విదేశాల నుంచి సైతం పెద్దసంఖ్యలో ఇక్కడికి భక్తులు వస్తుంటారు.రాహుకేతు పూజలను ఐదు రకాల ధరలతో విక్రయిస్తారు.రూ.500,రూ.750, రూ.1,500, రూ.2,500, రూ.5వేలు టిక్కెట్లుగా విభజించి ఆయా మండపాల్లో బ్యాచ్‌ల వారీగా పూజలు చేస్తుంటారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు రోజూ ఈ పూజలు జరుగుతూనే ఉంటాయి. మండపాల్లో ఆశీనులైన భక్తులకు సామూహికంగా సంకల్పాన్ని మైక్‌లో అనౌన్స్ చేస్తూ రాహుకేతు పూజలు జరిపిస్తారు.ఇదే మైక్ నుంచి అక్కడ పనిచేసే సిబ్బంది బహిరంగంగా దక్షిణ సమర్పించాలంటూ భక్తులను డిమాండు చేస్తున్నారు. దక్షిణ సమర్పిస్తేనే మీ దోషం పోతుందంటూ మానసికంగా భయపెడుతున్నారు.రూ.101 చెల్లించాలంటూ పీడించి మరీ వసూలు చేస్తున్నారు. నెల రోజుల నుంచి రూ.2,500 పూజల్లో అయితే రూ.201, రూ.5వేల పూజల్లో అయితే తప్పనిసరిగా రూ.501 దక్షిణ పెట్టాలంటూ భక్తులను బలవంతపెడుతున్నారు. ఆలయంలో నెలకు రాహుకేతు పూజలు సుమారు లక్ష వరకు జరుగుతాయని అంచనా. ప్రభుత్వం మారినా రాహుకేతు పూజామండపాల్లో వసూళ్లు ఆగలేదు. పైగా దక్షిణ ధరను ఖచ్చితంగా నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారు. ఇటీవల రూ.2,500 పూజల్లో రూ.201 దక్షిణ పెట్టాలంటూ అక్కడ సిబ్బంది మైక్‌లో ఆదేశించారు. అయితే రూపాయి నాణెం లేని కొందరు భక్తులు ఏంచేయాలో అర్థం కాక చుట్టుపక్కల వారిని యాచించాల్సిన దుస్థితి ఎదురైంది. మొత్తంగా ఆలయంలో రాహుకేతు పూజల ద్వారా లక్షలాది రూపాయల సొమ్మును పోగేసి కింది నుంచి పైస్థాయి అధికారి వరకు పంచుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాహువుకు, కేతువుకు వేర్వేరుగా సమర్పించండి

గతంలో పూజ చేసుకున్న తరువాత రూ.500 రాహుకేతు పూజల్లో రూ.101 సమర్పించాలని మైకులో భక్తులను ఆదేశించేవారు. అయితే ఇప్పుడు రద్దీ తక్కువుండే రోజుల్లో రాహువుకు రూ.151, కేతువుకు రూ.151 చొప్పున వేర్వేరుగా సమర్పిస్తేనే దోషం పోతుందంటూ వసూలు చేస్తున్నారు. పెరిగిన ఆదాయాన్ని వాటాలు వేసుకునే విషయంలో విబేధాలు తలెత్తాయి. దాంతో రూ.500 మండపంలో పని చేసే ఓ అర్చకుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.



రాహుకేతు పూజల్లో భక్తులు

యథేచ్ఛగా హారతిపళ్లేలతో వసూళ్లు

ఇటీవల ఆలయంలో హారతి పళ్లేల దందా బాగా పెరిగింది.హారతి పళ్లేల ద్వారా భక్తుల నుంచి దక్షిణ వసూలు చేయడాన్ని దేవదాయశాఖ నిషేధించింది.కానీ ముక్కంటి ఆలయంలో మాత్రం వైసీపీ పాలనలో హారతిపళ్లేల ద్వారా అధిక ఆదాయాలు లభించే స్థానాల కోసం పలువురు అర్చకులు పోటీపడ్డారు. ముడుపులు సమర్పించి మరీ ఆదాయ స్థావరాలను చేజిక్కించుకున్నారు.మూడేళ్ల క్రితం ఉన్నతస్థాయిలో ఉండే ఇద్దరు అర్చకులు భక్తుల ఎదుటే దక్షిణ విషయమై హారతి పళ్లేలను ఒకరిపై ఒకరు విసురుకునే స్థాయికి వివాదం రేగింది.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొద్దిరోజుల పాటు ఈ వసూళ్లను పక్కన పెట్టారు. కొద్దిరోజుల వ్యవధిలోనే ప్రధాన ఆలయంతో పాటు చిన్నచిన్న పరివార దేవతల వద్ద కూడా దాదాపు 20చోట్ల హారతి పళ్లేలు వెలిశాయి. బాహాటంగా దక్షిణ సమర్పిస్తేనే హారతి అనే విధంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

జూపార్కులో త్వరలో తెల్లపులుల సఫారీ

మంగళం, ఆగస్టు 17: ఎస్వీ జూపార్కులో త్వరలో వైట్ టైగర్ సఫారీని తిరిగి ప్రారంభిస్తున్నట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. శనివారం జూపార్కులో మీడియాతో మాట్లాడుతూ.. 2018లో వైట్ టైగర్ సఫారీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో మూసి వేశామన్నారు. ఇపుడు సఫారీలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం రూ.85లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే నాక్టర్నల్(రాత్రి పూట తిరిగే జంతువులు, పక్షులు) ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. వీటిలో పునుగు పిల్లులు, దేవాంగ పిల్లి, గుడ్లగూబ, తుమ్మల పందులు వంటి జంతువులను ఉంచుతామన్నారు. రూ.6కోట్ల బడ్జెట్‌తో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టుకు టీటీడీ రూ.2కోట్లు మంజూరు చేయగా.. ఇపుడు రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. ఏడు, ఎనిమిది నెలల్లో ఇది అందుబాటులో వస్తుందన్నారు. జిరాఫీలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని.. ఒక జత తెప్పించాలంటే రూ.3కోట్లు ఖర్చవుతుందని వివరించారు. మన జూపార్కులో రెండు జతల జిరాఫీల అవసరం ఉందన్నారు. జూపార్కుకు సందర్శకుల సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.8.5కోట్లకు చేరుకుందని, ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

జూపార్కులో ఏర్పాటు చేస్తున్న నాక్ టర్నల్ ఎన్‌క్లోజర్





స్టార్ ఎయిర్‌లైన్స్‌పై ప్రయాణికుల ఆగ్రహం



రేణిగుంట, ఆగస్టు 17: స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం రద్దు కావడంతో తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు నిరసన తెలిపిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు... శనివారం ఉదయం బెల్గాం నుంచి 10.45 గంటలకు తిరుపతికి వచ్చి 11.45 గంటలకు తిరిగి స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం బెల్గాం పోవాల్సివుంది. విమానం రద్దయిన విషయాన్ని ఉదయం ప్రయాణికులకు చెప్పకుండా మధ్యాహ్నం 1.30 గంటలకు చెప్పడంతో అప్పటి వరకు వేచివున్న ప్రయాణికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సుమారు 45 నిమిషాల పాటు స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.తరచూ ఇలా జరగడం వల్ల ప్రయాణికులు సంస్థ పట్ల నమ్మకం కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

→ స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల నిరసన

బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

● జిల్లాలో ఆరువేలమందికి అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 17: సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపింది. ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లో మొదట ఈ ప్రక్రియ చేపడతారు.జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు మినహా సుమారు ఆరువేలమంది బదిలీ కానున్నారు.రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, గ్రామ వార్డు సచివాలయాలు, గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వశాఖల్లోని ఇంజనీరింగ్ ఉద్యోగులు, దేవాదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖల్లోని ఉద్యోగుల బదిలీలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.రెవెన్యూశాఖ పరిధిలో సుమారు 1,800మంది,గ్రామపంచాయతీల్లో 700 మందితో కలుపుకుని మొత్తం 6వేలమంది దాకా బదిలీల జాబితాలో ఉన్నారు. సచివాలయాల్లో పని చేస్తున్న ఐదు వేలమంది కూడా బదిలీల జాబితాలో ఉన్నారు. నాలుగైదు రోజుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.ఇప్పటికే ఎమ్మెల్యేలనుంచి సిఫార్సు లేఖలను తీసుకుని చాలామంది ఉద్యోగులు అధికారుల చుట్టూ తిరుగుతున్న విషయం తెలిసిందే.

రేపటినుంచి ఈఏపీ సెట్ చివరి విడత కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), ఆగస్టు 17: ఈఏపీ సెట్- 2024 చివరి విడత కౌన్సెలింగ్ సోమవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరగనుంది. ఈ మేరకు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని అభ్యర్థులు చివరి విడతకు సోమవారం నుంచి ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు ఆప్షన్స్ నమోదు ఉంటుందన్నారు. 26వ తేదీన సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని, 26 నుంచి 30వ తేదీలోపు కళాశాలల్లో రిపోర్ట్ చేసుకోవాలని వివరించారు.

వైద్య సేవలు అభినందనీయం

● మంత్రి బాల వీరాంజనేయులు



కస్తూరిరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యసేవలు అందించడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయులు అన్నారు. పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానంలో మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం సతీమణి కస్తూరిరత్నం 4వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా కస్తూరిరత్నం చిత్రపటానికి మంత్రి బాల వీరాంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సూరజ్, శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్‌చార్జి వినిత, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, నారాయణ వైద్యశాల హెచ్ఆర్ సునందరావు, శ్రీధర్, అనిల్ పాల్గొన్నారు.

పాఠశాలలకు సామగ్రి వితరణ



నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : నాయుడుపేట, పుదూరు, ఎల్ఏ సాగరం గురుకుల పాఠశాలలకు శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ సామగ్రిని అందజేశారు. పుదూరు గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్, ఎల్ఏసాగరం గురుకుల పాఠశాలకు మోటారు, ఫ్యాన్‌ల రిపేర్ల కోసం రూ.7వేల నగదు అందజేసినట్లు రఫీ తెలిపారు. అనంతరం రఫీని సన్మానించారు. పుదూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ రమోలా, ఎల్ఏసాగరం పాఠశాల ప్రిన్సిపాల్ దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

యాకసిరి విద్యా కమిటీ ఎన్నిక వాయిదా

చిట్టమూరు, ఆగస్టు17: యాకసిరి ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక కోరం లేనందున శనివారం రెండవ సారి వాయిదా పడింది. ఇక్కడ వైసీపీ, టీడీపీ మధ్య గట్టి పోటీ ఉండడంతో వాయిదాకు కారణమైంది. ఈనెల 8న జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో విద్యార్థినే తల్లి పేరును నమోదు చేయడం, మరో తరగతిలో ఒకే పేరున రెండుసార్లు సూచించడంతో టీడీపీ వర్గీయులు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఎన్నికలు వాయిదా వేశారు. శనివారం కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో కోరం లేక వాయిదా పడింది.

వంజివాకలో చోటీ బచావో... చోటీ పడావో...

కోట, ఆగస్టు 17 : మండల పరిధిలోని వంజివాక ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం చోటీ బచావో... చోటీ పడావో కార్యక్రమం జరిగింది. సూపర్‌వైజర్ కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుస్తకాలు మోసే వయసులో పెళ్లి వద్దని, 18ఏళ్లలోపు ఆడపిల్లలకు, 21ఏళ్లలోపు మగపిల్లలకు పెళ్లిచేయడం నేరమని, ప్రోత్సహించేవారిపై చర్యలు తీసుకుంటామంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ సునీల, అంగన్‌వాడీ వర్కర్లు శ్రీవిద్య, అనిత, సరోజనమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైభవంగా పోతురాజు ఉత్సవాలు



పెళ్లకూరు, ఆగస్టు 17 : మండలంలోని రావులపాడులో పోతురాజుస్వామి ఉత్సవాలు మూడు రోజులుగా వైభవంగా జరుగుతు న్నాయి. శనివారం ఉద యం స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, తప్పెట్ల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగిం చారు. అనంతరం స్వామికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నాయకులు కేవీనాయుడు సమక్షంలో ఉత్సవాలు నిర్వహించారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాల అందజేత



సూళ్లూరుపేట, ఆగస్టు 17: జాతీయ అంతరిక్ష దినోత్సవాలను పురస్కరించుకుని షార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన సూళ్లూరుపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు ప్రోత్సాహక నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థులకు ప్రోత్సహిస్తే చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణిస్తారని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వాహకులు ఎం.ఎం.చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణిత విద్యాభ్యాసంపై శిక్షణ

డక్కిలి, ఆగస్టు 17 : ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు గణితం విద్యాభ్యాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం అందించాలని సూచించారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి అక్రమ తరలింపు

● వేగంతో బోల్తాపడిన ట్రాక్టర్



బాలాయపల్లి, ఆగస్టు17: మండలంలోని జయంపు గ్రామ చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు. శనివారం ఎనిమిది ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌తో చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు వచ్చి అడ్డుకున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



మొక్కలు నాటుతున్న ఏపీపీ ప్రకృతి కుమార్

వెంకటగిరిటౌన్, ఆగస్టు 17: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని ఏపీపీ ప్రకృతి కుమార్ అన్నారు. శనివారం ఆర్‌కే స్కూల్‌లో అటవీ శాఖ సబ్ డివిజనల్ అధికారి జ్ఞానప్రకాశం, రేంజర్ రాజేంద్రప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం వలన మానవాళికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల వితరణ



గూడూరు అర్బన్, ఆగస్టు 17: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సహకారంతో పాఠశాలకు 3 కంప్యూటర్లను రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం అందజేశామని రోటరీ క్లబ్ సభ్యుడు మునిగిరీష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాఠశాలలో చదవిన పూర్వ విద్యార్థి చదలవాడ మురళీధర్ హైదరాబాదులో రోటరీక్లబ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడన్నారు. రోటరీక్లబ్ ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, కృష్ణయ్య, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, జగదీష్, హరిప్రసాద్, హెచ్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం పట్టణంలోని సంబంధిత కార్యాలయం నుంచి ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మీకు తెలుసా అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించినట్లు నవజీవన్ ఆర్గనైజేషన్ మేనేజర్ బాలాజీ తెలిపారు.

దుకాణాలకు వేలంపాటలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : పట్టణంలోని నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లోని 5 దుకాణాలకు వేలంపాటలు నిర్వహించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జనార్థన్‌రెడ్డి ఆధ్వర్యంలో 1, 4, 5, 11, 15 దుకాణాలకు వేలం పాటలు నిర్వహించినట్లు జనార్థన్‌రెడ్డి తెలిపారు. ఈ వేలంపాటల్లో ఎస్‌కె పర్వీన్, చింతల వెంకటేశ్వర్లు, వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, కొరివి సుబ్రహ్మణ్యం, కాపులూరు అనిల్‌కుమార్‌లు హెచ్చుపాటదారులుగా నిలిచారని కమిషనర్ తెలిపారు.

ఓడూరు పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా

చిల్లకూరు,ఆగస్టు17: మండలంలోని ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించాల్సిన ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా ఎంఈవో రఫూఫ్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాల, ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. శనివారం పారిచెర్లవారిపాళెం ఉన్నతపాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప వాదనలు చోటు చేసుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతిని కొందరు వైసీపీ వర్గీయులు దుర్భాషలాడారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యాకమిటీ ఎన్నిక వాయిదా

కోట, ఆగస్టు 17 : కోట మండలంలోని రెండు పాఠశాలల్లో కోరం లేక విద్యాకమిటీ చైర్మన్ ఎన్నికలు శనివారం వాయిదా పడ్డాయి. గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకునేందుకు తల్లిదండ్రులను పిలిచినప్పటికీ 50శాతం కూడా రాకపోవడంతో ఎంఈవో మస్తానయ్య, హెచ్ఎం గిరిబాబు ఈ ఎన్నికను వాయిదా వేశారు. అదేవిధంగా గోవిందపల్లి ప్రాథమిక పాఠశాలలో కూడా 50శాతం వరకు కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. అదేవిధంగా వాయిదాపడి ఉన్న ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యాశాఖ మంత్రిని కలసిన టీడీపీ నేత



నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 : రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్ర కలిశారు. ఉండవల్లిలో శనివారం జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రిని కలసి వినతి పత్రం అందజేసినట్లు రాజేంద్ర తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో తనపై అన్యాయంగా కేసులు బనాయించారని, ఆ కేసులను విచారించి తనకు న్యాయం చేయాలని కోరినట్లు రాజేంద్ర తెలిపారు.

గంగమ్మ ఆలయానికి ఇన్వర్టరు వితరణ



చిల్లకూరు, ఆగస్టు 17: చిల్లకూరు గొల్లపాళెంలోని గంగమ్మ ఆలయానికి శనివారం పెంచలయ్య, మునిప్రసాద్ సహకారంతో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇన్వర్టరును వితరణగా అందజేశామని సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధనుంజయ, రమేశ్, సురేశ్, శ్రీనివాసులు, హరి, గోపీ, సంస్థ సభ్యులు రామ్మోహన్‌రావు, ప్రభాకర్, కుమార్‌నాయుడు, రామకృష్ణ, శ్రీనివాసులు, నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు,ఆగస్టు17: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ సేవ జరిపి ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పాఠశాలకు పర్నీచర్ వితరణ

చిల్లకూరు, ఆగస్టు 17: మండలంలోని చింతవర జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ నారాయణ రూ.5వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. హెచ్ఎం శివసుబ్రమణ్యం మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి





గూడూరు ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది - నాయుడుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్ హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని గూడూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల వైద్యులు, వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే వైద్యులకే దేశంలో రక్షణ కరువైందన్నారు. చట్టాలను కఠినతరం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జనార్ధన్‌రెడ్డి, రోహిణి, మైథిలి, రాజా, బ్రహ్మయ్య, తనూజ, స్వరాజ్యం, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, నరసారెడ్డి, సిబ్బంది గౌరీ, మౌలాలి, బాబురావు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్ : వైద్య విద్యార్థినిపై దాడి అమానుషమని స్త్రీ విముక్తి ఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్య సేవల బంద్‌కు మద్దతు పలికారు. యువతను మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల మత్తులో ముంచెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వి.వి. రమణయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి : కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటనకు కారకులైన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ శనివారం వెంకటగిరిలో ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణ నివాసానికి చేరుకొని ఆయన వినతిపత్రం అందచేశారు. వైద్యులకే రక్షణ లేకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఘటనలో బాధితులకు త్వరగా న్యాయం జరగాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు సంజీవురాయుడు, కళాధర్, జయప్రకాష్, ముదసూననాయుడు, రామాంజనేయులు, బద్రీనవీన్, సత్యనారాయణ, సాయి,చల్లా సుమన్, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ వైద్యులు ర్యాలీ నిర్వహించారు. శనివారం పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వైద్యులు, సిబ్బంది పూలమాలలు వేసి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వైద్యులు, సిబ్బందిపై ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ గోపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు హరిప్రియ, చంద్రకళ, రామసుబ్బయ్య, వెంగయ్య, చైతన్య, స్రవంతి, క్రాంతి, శ్రీధర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి పుర వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దోషులను వెంటనే శిక్షించాలంటూ వారు డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు తడుకు చెందు, వినయ్, తులసీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి : కలకత్తా మెడికో ఘటనపై శనివారం ఓజిలి పీహెచ్‌సీ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఓజిలితోపాటు పెద్దపరియ, వజ్జావారిపాళెం, అత్తివరం పీహెచ్‌సీలలో కూడా అక్కడి సిబ్బంది నిరసన చేస్తూ విధులు చేపట్టారు.

తడ : మహిళా ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా తడ, రామాపురం పీహెచ్‌సీలో వైద్యులు నిరసనకు దిగారు. వైద్యులకు భద్రత కల్పించాలంటూ నినాదాలు చేశారు. వైద్యులు కిషోర్, జయశ్రీదేవి, స్వర్ణలత, తదితరులు ఉన్నారు.

వైద్యుల నిరసనతో నిలిచిన ఓపీ



ఓపీ లేకపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న రోగులు వేచివుండే ప్రాంతం

గూడూరు, ఆగస్టు 17: కోల్‌కత్తాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జరిగిన జూనియర్ మహిళా డాక్టర్ హత్యను నిరసిస్తూ వైద్యులు 24 గంటలపాటు ఓపీని నిలిపివేసి నిరసన తెలిపారు. దీంతో శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఓపీని నిలిపివేసి నిరసన తెలుపుతున్నట్లు వైద్యులు ప్రకటించారు. ఈ క్రమంలో శనివారం ఏరియా ఆసుపత్రి రోగులు లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. ఏరియా ఆసుపత్రిలో రోజుకు సుమారు 500 మంది వరకు రోగులకు ఓపీ ద్వారా వైద్యపరీక్షలు నిర్వహిస్తుంటారు. పట్టణ, సమీప గ్రామాల నుంచి వచ్చే రోగులతో ఓపీ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అయితే వైద్యురాలి హత్యను ఖండిస్తూ వైద్యులు 24గంటల పాటూ ఓపీ నిలిపివేయడంతో ఓపీ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రమే వైద్యపరీక్షలు నిర్వహించారు. అత్యవసర కేసులను, కాన్పుల విభాగాన్ని యదావిధిగా కొనసాగించారు.

మహిళా డాక్టర్ హత్యను నిరసిస్తూ ...







చిట్టేడు, సూళ్లూరుపేట, బాలాయపల్లిలో ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

కోట, ఆగస్టు 17 : కోల్‌కత్తా నగరంలో గ్యాంగ్ రేప్‌కు గురై హత్యకాబడిన మెడిసెన్ విద్యార్థినికి న్యాయం జరిగి దోషులను కఠినంగా శిక్షించాలంటూ శనివారం కోట, చిట్టేడులలో వైద్య సిబ్బంది ఆందోళన, నిరసన చేపట్టారు. 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ రూప, డాక్టర్ డోంప్రియ రావు ఆధ్వర్యంలో, చిట్టేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో, కోటలో ప్రైవేట్ వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి.

సూళ్లూరుపేట : వైద్యురాలి హత్యను నిరసిస్తూ శనివారం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వైద్య సిబ్బంది నిరసన చేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జి రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది అందరూ నిరసనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిందితులకు కఠినశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా 24 గంటలపాటు వైద్య సేవలు బంద్ చేస్తున్నట్లు తెలిపారు.

బాలాయపల్లి : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ శనివారం వైద్యాధికారులు నిరసన తెలియజేశారు. ఇలాంటి అకృత్యాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీ హంస యూనియన్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షురాలు రాజేశ్వరి, మునిరాజ ఉన్నారు.

సర్వీస్ రోడ్డు కోసం వడ్డిపాలెంవాసుల నిరసన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెళ్లకూరు, ఆగస్టు 17 : మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఆరువరుసల జాతీయ రహదారి దాటేందుకు వసతిలేకపోవడంతో ఆ గ్రామస్తులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మూకుమ్మడిగా 71వ జాతీయ రహదారిపైకి చేరుకుని దిగ్బంధం చేశారు. సుమారు గంట వరకు రాస్తారోకో చేపట్టారు. బడి పిల్లలు స్కూల్‌కు, రైతులు, కూలీలు పంట పొలాలకు ప్రతి నిత్యం ప్రాణాలు పణంగా పెట్టి జాతీయ రహదారి దాటి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. సర్వీస్ రోడ్డు నిర్మించకపోగా రహదారికి ఇరువైపులా కంచె ఏర్పాటు చేయడంతో సుమారు కిలోమీటర్ దూరం వెళ్లి రోడ్డు దాటే పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్లు వచ్చి సర్వీస్ రోడ్లు నిర్మించే వరకు రోడ్డు దాటేందుకు దారి సౌకర్యం కల్పిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

లక్ష మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

ఎమ్మెల్యే విజయశ్రీ, రాజేష్‌లను కలసిన ఎన్నారై



ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులను సత్కరిస్తున్న ఎన్ఆర్ఐ వంశీకృష్ణ

పెళ్లకూరు, ఆగస్టు 17 : ఐరోపా దేశాలలో చదువుకోవాలనుకునే వారికి, పరిశోధక విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని జీలపాటూరు గ్రామానికి చెందిన టీడీపీ యూకే ఎన్నారై విభాగం కన్వీనర్ వంశీకృష్ణ ఆరూరు తెలిపారు. ఆయన శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె సోదరుడు రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలోని 68 విద్యార్థులకు విదేశాలలో ఉద్యోగాలు కల్పించడంలో సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో టీడీపీకి మద్దతుగా చేసిన ప్రచారంలో లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చామని, అందుకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా లండన్, ఐరోపాలోని ఇతర నగరాలలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు పూర్తిగా మద్దతు పలుకుతామని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులతో పాటు నెలవల రాజేష్‌ను ఘనంగా సత్కరించారు.

తిరుమలలో హాకర్ల మధ్య ఘర్షణ



ఘర్షణకు దిగిన శ్రీకాంత్, శ్రీనివాస్

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో పరస్పరం దాడి చేసుకుంటూ వీరంగం సృష్టించారు. వ్యాపార విషయంలో మొదలైన గొడవ పెరిగి తీవ్రంగా గాయపరుచుకునేంతవరకు వెళ్లింది. రక్తగాయాలతో పెద్దపెద్ద కేకలు వేస్తూ వారు చేసిన వీరంగానికి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. నల్గొండకు చెందిన శ్రీకాంత్, తిరుపతికి చెందిన శ్రీనివాస్ తిరుమలలోని నందకం విశ్రాంతి భవనం ముందు అనధికారికంగా భక్తులకు షాంపూలు, సోపులు, బ్రష్‌లు వంటివి విక్రయిస్తుంటారు.నా స్థానంలో నువ్వు వ్యాపారం చేస్తున్నావని ఒకరు, నేను అమ్మే వస్తువులు నువ్వు ఎలా విక్రయిస్తావని మరొకరు గొడవకు దిగారు. కొద్దిసేపు వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన ఇద్దరూ పక్కనే ఉన్న ఓ డెయిరీ పార్లర్ వద్ద గాజు బాటిళ్లను తీసుకుని దాడులు చేసుకున్నారు. ఇద్దరికి తీవ్రస్థాయిలో రక్త గాయాలయ్యాయి. ఈ క్రమంలో అక్కడున్న భక్తులు హడలిపోయారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి ఘటనా ప్రాంతానికి చేరుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలు నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విమాన ప్రదక్షిణగా ఉత్సవ మూర్తులు ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈకార్యక్రమ నేపథ్యంలో ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.టీటీడీ జీయర్ స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.